క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కందుకూరు రూరల్: మండలంలోని మహదేవపురం గ్రామ సచివాలయం పరిధిలోని కాకిబంగారుపాలెంలో మంగళవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.విజయశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ఆయా శాఖల పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

నేడు చినకండ్లగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం

కొండపి: మండలంలోని చినకండ్లగుంట గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కార్యాలయ బాధ్యులు తెలిపారు. ముందుగా తాటాకులపాలెంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మద్యం మత్తులో బస్సు కింద తిష్ట


బస్సు కింద కూర్చున వ్యక్తి

ఉలవపాడు: మండల పరిధిలోని అలగాయపాలేనికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తు ఎక్కువై ఆర్టీసీ బస్సు కింద కూర్చోవడంతో బస్సు అర గంట పైన నిలిచిపోయిన సంఘటన సోమవారం ఉలవపాడు పాత బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. కావలి నుంచి ఒంగోలు వెళుతున్న బస్సు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రయాణికులను ఎక్కించుకోవడానికి పాత బస్టాండ్ వద్ద ఆగింది. ఈ సమయంలో మద్యం సేవించిన వ్యక్తి బస్సు కింద కూర్చున్నాడు. అందరూ బయటకు రమ్మని బతిమాలుతున్నా వినిపించుకోలేదు. దాదాపు 30 నిమిషాలపాటు మద్యం మత్తులో ఇష్టారీతిగా మాట్లాడుతూ ఇబ్బంది పెట్టాడు. సహనం కోల్పోయిన స్థానికులు బస్సు కింద తిష్ట వేసిన వ్యక్తిని బయటకు తీసుకొచ్చారు. మందుబాబును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బస్సు బయలుదేరింది.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.65 లక్షలు


శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,65,795 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.67,080, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.15,075, శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు విరాళం రూ.58,524, మహా ప్రాకారం నిర్మాణానికి దాతల విరాళం రూ.25,116 వచ్చాయని వివరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడు కృష్ణ భార్యకు నగదు అందజేస్తున్న స్నేహితులు, సర్పంచ్

గుడ్లూరు: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అతని స్నేహితులు రూ.42 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. వివరాలు.. మండలంలోని కర్లపాలెం గ్రామానికి చెందిన చాపల కృష్ణ 2000 సంవత్సరంలో ఉలవపాడు మండలం రామాయపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఇటీవల కాలంలో విద్యుత్ షాక్‌తో కృష్ణ మృతి చెందాడు. మిత్రుడి పిల్లల చదువు నిమిత్తం సోమవారం కర్లపాలెం గ్రామానికి వెళ్లి సర్పంచ్ చాపల రమణయ్య చేతులమీదుగా రూ.42 వేల నగదును కృష్ణ సతీమణికి అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మదర్సా అభివృద్ధికి కృషి

కందుకూరు: పట్టణంలోని ముల్లావారిపాలెంలో అల్ ఖలీల్ మదర్సా ఇన్‌చార్జిగా షేక్ ఇబ్రహీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మదర్సాలో నిర్వహించిన సమావేశంలో ఇబ్రహీంను ఎన్నుకున్నారు. మత పెద్దల సహకారంతో మదర్సా అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.


కనిగిరిలో వాసవీ మాత ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


కొండపి : కోదండరామస్వామి గ్రామోత్సవం


కొండపిలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

అబ్బురం.. సంక్రాంతి సంబరం

మకర సంక్రాంతి పర్వదినాన్ని కనిగిరి, కొండపి నియోజకవర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆలయాల్లో పూజలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లో లోగిళ్లు అందమైన రంగవల్లులు, గొబ్బెమ్మలతో కళకళలాడగా.. హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ సందడి చేశారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల్లో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా పాలుపంచుకున్నారు. చిన్నారులు పతంగులు ఎగరేస్తూ ఉత్సాహంగా గడిపారు.

■ కనిగిరి రూరల్: కనిగిరిలోని వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరీ, సాయిబాబా దేవస్థానం, కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తాళ్లూరులో వివిధ రకాల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వాలీబాల్ విజేతలకు తాళ్లూరు ఉప సర్పంచ్ మూలె మాలకొండారెడ్డి చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు.

■ సీఎస్‌పురం: మండలంలోని పలు గ్రామాల్లో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సీఎస్‌పురం, డీజీపేట, అయ్యలూరివారిపల్లి, వెంకటాయచెరువు, బోయమడుగుల తదితర గ్రామాల్లో చెక్క భజన, పండరి భజనతో యువకులు సందడి చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. నారాయణస్వామి ఆలయంలో మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు చెల్లించారు.

■ పామూరు: స్థానిక అంకాళమ్మవీధిలో వైఎస్సార్‌సీపీ, పార్టీ నాయకులు యాదాల వెంకట సాయికిరణ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీపీ లక్ష్మి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, కోఆప్షన్ నాయబ్‌రసూల్, సర్పంచ్ రాగమ్మ, మాజీ సర్పంచ్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

■ కొండపి: స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు రవీంద్రశ్యామ్ చేతుల మీదగా బహుమతులిచ్చారు. కొండపిలోని శ్రీమహవిష్ణువు, శివపార్వతులు, కోదండరామస్వామి, ప్రసన్నాంజనేయస్వామి, అయ్యప్పస్వామి ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

■ పొన్నలూరు: మండలంలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్థానిక రామాలయం యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ, మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పొన్నలూరులో కొన్ని సందేశాలను తెలుపుతూ మహిళలు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి.

■ టంగుటూరు: వల్లూరులోని వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలు ఆటల పోటీలు నిర్వహించి అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

■ సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామంలో సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని గ్రామ యూత్ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు నిడమానూరి సురేంద్ర, చిలకపాటి సుధాకరరావు పాల్గొన్నారు.


జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములవారు


నారాయణస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు


పొన్నలూరులో కబడ్డీ ఆడుతున్న యువకులు


పామూరులో బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ తదితరులు


సింగరాయకొండ: బహుమతులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కనుల పండువగా తెప్పోత్సవాలు


వల్లూరులో వల్లూరమ్మతల్లి తెప్పోత్సవం


దావగూడూరు చెరువులో చెన్నకేశవస్వామి, మల్లేశ్వరస్వామివార్ల తెప్పోత్సవం

● భారీగా తరలివచ్చిన భక్తులు

సింగరాయకొండ/టంగుటూరు: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భవనాశి చెరువులో ఊరేగించారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు రాజు కోటేశ్వరమ్మ వెంకటేశ్వరరెడ్డి, గోకరాజు పాపయ్య, ఆదిపోగు మాలకొండయ్య, ఆలయ ఈఓ పి.కృష్ణవేణి, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు. జరుగుమల్లి మండలం దావగూడూరులోని చెన్నకేశవస్వామి ఆలయం, మల్లేశ్వరస్వామి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివార్లను రెండు వేర్వేరు తెప్పలపై ఊరేగించారు. ఎంపీపీ బెల్లం నిర్మల, సత్యన్నారాయణ దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నేతి వేణుగోపాల్, సర్పంచ్ రామ్మూర్తి, ఈఓ రజనీకుమారి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో సాయంత్రం మోటారుసైకిల్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

■ టంగుటూరు: ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ తల్లి అమ్మవారి తెప్పోత్సవం గుడి పక్కనే ఉన్న చెరువులో వైభవంగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తెప్పోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు భక్తులకు ఏర్పాటు చేశారు. అలాగే టంగుటూరు, జమ్ములపాలెం, కొణిజేడు, కాకుటూరివారిపాలెం, ఆలకూరపాడులో స్వామివార్ల తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు.


జమ్ములపాలెంలో తెప్పోత్సవంలో స్వామివార్లు


భవనాశి చెరువులో లక్ష్మీనరసింస్వామి తెప్పోత్సవం

జిల్లా స్థాయి కబడ్డీ విజేత పెదారికట్ల

మర్రిపూడి: సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో పెదారికట్ల టీమ్ విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో 20 కబడ్డీ టీమ్‌లు పాల్గొన్నాయి. తొలుత గుండ్లసముద్రం-పెదారికట్ల టీమ్ మధ్య సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్ మ్యాచ్‌లో పెదారికట్ల టీమ్ ఫైనల్‌కు చేరుకుంది. మర్రిపూడి ఫ్రెండ్స్ టీమ్- పెదారికట్ల టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో మర్రిపూడి ఫ్రెండ్స్ టీమ్‌కు 19 పాయింట్లు రాగా, పెదారికట్ల టీమ్‌కు 24 పాయింట్లు రావడంతో విజేతగా నిలిచి ప్రథమ బహుమతిగా రూ.10,116 గెలుచుకున్నారు. అలాగే ద్వితీయ బహుమతిగా మర్రిపూడి ఫ్రెండ్స్ టీమ్ రూ.7,116, గుండ్లసముద్రం టీమ్ తృతీయ బహుమతిగా రూ.5,116 బహుమతిగా గెలుచుకున్నారు. అలాగే జూనియర్ విభాగంలో మర్రిపూడి- ధర్మవరం టీమ్‌ల మధ్య జరిగిన ఫైనల్ కబడ్డీ పోరు లో మర్రిపూడి టీమ్ విజేతగా నిలిచి రూ.3,116 ప్రథమ బహుమతిగా గెలుచుకున్నారు. ధర్మవరం టీమ్ రూ.2,116 ద్వితీయ బహుమతిగా గెలుపొందారు. విజేతలకు స్థానిక ఎస్ఐ పీ అంకమ్మరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూ పవన్, ఎస్ సాయి, కే ప్రవీణ్, ఈ శ్రీకాంత్, యూ బాలు, జీ బ్రహ్మానందం, వెంకటేష్, నరేంద్ర పాల్గొన్నారు.


పెదారికట్ల టీమ్ సభ్యులకు ప్రథమ బహుమతి అందజేస్తున్న ఎస్ఐ అంకమ్మరావు

క్రికెట్ టోర్నీ విజేత బాలిరెడ్డిపాలెం జట్టు

పొన్నలూరు: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని పైరెడ్డిపాలెంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో బాలిరెడ్డిపాలెం జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో పలు మండలాల నుంచి మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో బాలిరెడ్డిపాలెం, పైరెడ్డిపాలెం జట్లు తలపడగా బాలిరెడ్డిపాలెం జట్టు గెలుపొందింది. విజేతగా నిలిచిన జట్టుకు రూ.50 వేలు, రనరప్ జట్టుకు రూ.25 వేల నగదుతో పాటు కప్‌ను జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎస్సై దాసరి రాజారావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్నా మస్తాన్‌రెడ్డి, సగిలి సుధాకర్‌రెడ్డి, సన్నపురెడ్డి మాలకొండారెడ్డి, తేళ్ల కోటిరెడ్డి, హెచ్ఎం బి.వెంకట్రావు గ్రామస్తులు పాల్గొన్నారు.


బాలిరెడ్డిపాలెం జట్టుకు నగదు, కప్ అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎస్సై

జూదరులు అరెస్టు

● నగదు, కోడిపుంజులు, కత్తులు, బైక్‌లు స్వాధీనం

పీసీపల్లి/హనుమంతునిపాడు/పొన్నలూరు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆది, సోమవారాల్లో ఏర్పాటు చేసిన కోడి పందెం శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి నగదు, కోడి పుంజులు, కత్తులు, బైకులు స్వాధీనం చేసుకున్నారు.

■ పీసీపల్లి మండలం పెదఇర్లపాడు ఎస్సీ కాలనీ సమీపంలోని పొలాల్లో ఆదివారం కోడి పందెం శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు కనిగిరి సెబ్ సీఐ షేక్.అబ్దుల్ జలీల్ తెలిపారు. నిందితుల నుంచి రు.56,900 నగదు, 4 కోడి కత్తులు, 4 కోడి పుంజులు, 3 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసులు నమోదు చేసి పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పినట్లు తెలిపారు. బట్టుపల్లి పొలాల్లో సోమవారం కోడి పందెం శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.2,280 నగదు, కోడిపుంజు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

■ హనుమంతునిపాడు: పాపిరెడ్డిపల్లి పొలాల్లో కోడి పందెం శిబిరంపై దాడి చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై కృష్ణపావని సోమవారం తెలిపారు. నిందితుడి నుంచి ఒక కోడి, రూ.2,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

■ పొన్నలూరు: మండలంలోని చెరుకూరు గ్రామ శివారులో కోడి పందెం శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై డి.రాజారావు సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రెండు కోళ్లు, కోడి కత్తులు, రూ.2,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చౌటపాలెం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.11650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ ఖాజీగా పఠాన్ గులాం రసూల్


చైర్మన్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఖాజీ గులాం రసూల్

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా పఠాన్ గులాం రసూల్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఖాజీ సేవలను ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చట్ట ప్రకారం, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని ఖాజీకి సూచించారు.

పేదలకు భోజనం పంపిణీ

కందుకూరు అర్బన్: కనుమ పండగ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచన మేరకు యడ్ల మాధవరెడ్డి పేదలకు భోజనం పంపిణీ చేశారు. జనార్దన కాలనీలోని ఎస్టీలు, బొగ్గుల సంఘం పేదలు మొత్తం 80 కుటుంబాలకు మాంసాహారం అందజేశారు. అలాగే శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కె.ఆదినారాయణ సహకారంతో పట్టణంలో పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు, చీదెళ్ల కృష్ణ, దువ్వూరి స్వామిదాసు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పేదలకు భోజనం పంపిణీ చేస్తున్న యడ్ల మాధవరెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టంగుటూరు: నిద్రమత్తులో డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన టంగుటూరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై నుంచి చిలకలూరిపేటకు వెళ్తున్న కారు మార్గ మధ్యంలో టంగుటూరు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మరో ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తికి తీవ్రగాయాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మతిస్థిమితం లేని నిమ్మగడ్డ బ్రహ్మయ్య నడుస్తూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. బ్రహ్మయ్య తల, కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

పండగ వేళ సేవా కార్యక్రమాలు


దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న మదర్ థెరిసా సేవా సమితి సభ్యులు

కనిగిరి రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పలు చోట్ల స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, అధికారులు, సేవాతత్పరుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల పాఠశాలలో దుప్పట్లు, స్వీట్లు, పిండి వంటలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే శివ సమూహం సేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యుడు ఎస్వీఎల్ నారాయణ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.